# జానకి ఆడిన అంతర్నాటకం

రచన :

**పారనంది. లోకనాథేశ్వర రావ్**

ఫ్యాక్టరీ గడియారం అయిదు గంటలు కొట్టింది. కూలీలంతా 'ఉస్'మంటూ ఫ్యాక్టరీ ఆవరణదాటి రోడ్డమ్మటపడ్డారు. ఆఫీసు సిబ్బంది మేనేజర్‌గారు శెలవు తీసుకుని బయటకొచ్చారు.

అర్జంటు కాగితాలు కొన్ని సంతకాల కుండడంవల్ల మేనేజర్ కామేశంగారు, త్వర త్వరగా టైప్‌చేస్తున్న లేడీ టైపిస్ట్ "విజయ" మాత్రమే మిగిలారు.

క్యాషియర్ శ్యామలరావు కాస్సేపు వరండాలో తచ్చాడి విజయవైపు అర్థపూరితమైన నిశితదృక్కులు పరిపి, మరీ ఫ్యాక్టరీ ఆవరణ దాటాడు. విజయకూడా కాస్త చలించలేక పోలేదు.

"విజయా" మేనేజర్‌గారి అధికారస్వరం.

"సార్ వస్తున్నా, టైప్‌చేయడం పూర్తి కావచ్చింది"

"దట్స్ ఆల్ రైట్ .... వేగంకానీ .... నీ కోసమే నిరీక్షిస్తున్నాను." మేనేజర్ సిగరెట్ రింగురింగులపొగలు గదిని ఆవరించాయ్.

"సార్....యివిగో కాగితాలు...."

"వెరీగ్లాడ్, ఆ టేబిల్‌మీద పెట్టు"

"వస్తాను సార్ శెలవ్"

"కూర్చో విజయా .... అపుడే ఏంతొందర"

వినయంగా కామేశంగారి కెదురుగావున్న కుర్చీలో తన విశాల ఘనభారాన్ని మోపింది విజయ. కామేశం కాగితాలు సంతకంపెడ్తూ

"బాగానే టైప్‌చేశావ్ విజయా...."

"ఆ ఏం బాగండీ మీ అభిమానం అంతే"

"బాయ్" కామేశంగారి కేకతో ఆఫీసు బోయ్ హాజర్.

"చూడూ, ఈ ఫ్లాస్కు పట్టుకెళ్లి రెండు స్ట్రాంగ్ కాఫీ తే...."

"అలాగే సార్"

"ఇప్పుడెందుకండీ...." విజయ వినయ స్వరం.

"ఫర్వాలేదులే....మీ యింటికొస్తే యివ్వాలని భయపడ్తున్నావేమిటి"

"ఎంతమాటండీ...."

కామేశం సంతకాలు పూర్తిచేసి, కాగితాలు ప్యాడ్‌లోకట్టి టేబిల్‌కొసన వుంచాడు.

"మరేమిటి విజయా విశేషాలు...."

"ఏమున్నాయండీ .... మీ అభిమానంవల్ల పని సక్రమంగా జరిగిపోతోంది....నిజానికి ఆనాడు మీ సిఫార్సువల్లే నాకీ ఉద్యోగం దొరికింది. లేకుంటే ఆ కష్టదశలో నేనూ నా తల్లీ ఎన్నికష్టాలుపడివుండాల్సిందో మీకాజన్మాంతం కృతజ్ఞురాల్ని...."

"ఏమిటి విజయా తెగపొగిడేస్తున్నావ్.... కష్టదశలో ఉన్నపుడు ఒకర్నొకరు ఆదుకోవడం మానవవిధిగా...."

"అయినా అందరూ అలానే ఉంటారా"

"గాని విజయా....నీవేమీ అనుకోనంటే"

"ఏమిటండీ...."

"ఆ ఏం లేదు. పట్టుమని పద్దెనిమిదేళ్లేనా లేవు. ఆ విధి నీ నొసట యీ వ్రాత ఎందుకు వ్రాశాడు! ఆ కలకల్లాడే నీ సుందరవదనానికి పుణ్యస్త్రీసూచకమైన ఆ బొట్టే ఉంటే...."

"అయ్యో క్షమించండి....నా గత జీవితం జ్ఞప్తికి వస్తుంటే ఏదో విపరీతమైన బాధగా వుంది...."

"మరేం అనుకోకు విజయా....నీ మనసుకు నొప్పి కల్గించాను. నీ మిసమిసలాడే యౌవనపుపొంగు యిలా సేవావృత్తిలో హరించి పోయేకన్న సంస్కారివి గనుక, విద్యావంతురాలివి గనుక చక్కగా సాంసారిక జీవితం గడుపుతే ఎంత ఉల్లాసంగా ఉండివుందువో అన్న ఆరాటం నన్నలా అనిపించింది...."

ఎవరు కర్మకి ఎవరు కర్తలు....ఎంత పెట్టి పుట్టామో అంతేనా...."

"అలా బాధపడకు విజయా....ఆ కన్నీరేమిటి" కామేశంగారు తనచేతిగుడ్డతో విజయ కన్నీరు తుడువబోతుంటే....

"క్షమించండి...." అంటూ విజయ కుర్చీలోంచి లేచింది,

"వి....జ....యా...." అంటూ కామేశం, విజయచేయి పట్టుకొని దగ్గరసా లాక్కున్నాడు...."

"ఒద్దండీ .... మీరు వివాహితులు .... నా జీవితం...."

"ఫర్వాలేదు....విజయా .... మానవసహజమైన కోర్కెలను మనం అరికట్టగలమా...."

విజయ నోటమాటలేదు....అలా అప్రయత్నంగా కామేశం హృదయంమీద వాలిపోయింది.

"అబ్బా....విజయా...."

"అ....బ్బా...."

నాల్గు పెదవులూ ఐక్యం. మధురక్షణాలు!

* * *

కాలచక్రం గిర్రున దొర్లిపోతోంది. విజయా కామేశంల ప్రణయం దినదినప్రవర్ధమానంగా వెలిగిపోతోంది. విజయను విడచి కామేశం, కామేశంను విడచి విజయ ఒక నిముషం కూడా ఉండలేకపోతున్నారు. ఆఫీసులో కామేశం, విజయకిస్తున్న ట్రీట్‌మెంట్ తక్కిన 'స్టాఫ్' కంతకూ అసూయా కారణమైంది. విజయా కామేశంల రహస్యసంబంధం అలా అలా ప్రాకిపోతోంది అయినా ఇవేమీ లెక్కచేయక తమ నాటకం. సాగిస్తూనేయున్నారు విజయా కామేశంలు.

ఓనాటి మధ్యాహ్నం—

కాఫీ, టిఫిన్ అయ్యగారికి పంపించి, సీతాదేవిగారు గదిలో యీజీచేర్‌లో కూలబడింది ఏమీ తోచక. అప్రయత్నంగా ఆమెదృష్టి గది కిటికీలోపల ఎన్వెలప్ మీద పండింది. ఆత్రంగాలేచి, విప్పిచదివింది.

"సీతాదేవిగారూ!

ఈ అనుకోనిలేఖ మిమ్మి ఆరాటపెడ్తుందన్నసంగతి నాకు తెల్సు. అయినా మీక్షేమం విచారించి వ్రాయవలసివచ్చింది .... అయ్యగారు మునుపటిలాగే యిపుడు, మీతో ఉంటున్నారా? ప్రతిరోజూ సాయంత్రం జంటగా బీచి షికార్ల కెళ్లేవారే. ఆ బీచిషికార్లు ఆగిపోయినా యేం? వారానికి రెండుసార్లు ఏ చెత్తసినిమాకైనా సరే వెళ్లేవారే. ఇప్పుడది లేదేం?....... ఆఫీసుపని ఒత్తిడి అని మీకు సాకుచెప్పి, మిమ్ములను తృప్తిపర్చవచ్చు. అసలుసంగతి విన్నవిస్తున్నా వినండి. కొత్తగా నెల్లాళ్లాయి ఓ అందాల అమ్మాయ్....పేరుచెప్పమంటారా దాపరికమెందుకూ .... "వి....జ....య...." ఆఫీసులో లేడీ టైపిస్టుగా కుదిరింది. ఇపుడు

వారిదే రాజ్యం. బీచి పూర్తిగా సర్వేచేస్తున్నారంటే నమ్మండి. సినిమాలా మరి చెప్పక్కర్లేదు. ఇంక మీ యిష్టం. మూతి ముడుచుకు అలో లక్ష్మణా అని కూర్చుంటారో .... విద్యావంతులు గనుక మీరు సరియైన గుణపాఠం చెప్పి, మీ బ్రతుకు సరిదిద్దుకుంటారో.... అంతా మీమంచికే....మరోలా అనుకోకండి.

ఉంటా....

"మీ సోదరతుల్యుడు"

సీత నవనాడులూ కృంగిపోయాయి.... ఒళ్ళు కంపించిపోతోంది .... కళ్ళెర్రబారాయి. పళ్ళు పటపట కొరుకుతోంది.

"అంతా కపటప్రేమ. నా నిర్మలప్రేమ, అమాయకాన్ని అండగా చూసుకొని యిలా పరాయిస్త్రీతో కులుకుతున్నారా మేనేజర్ గారూ....రోజూరాత్రి 9 గంటలపైబడి యింటి కొస్తుంటే, పాపం ఆఫీసుపని ఒత్తిడి అని నిజంగా నమ్మాను. ఇదా నాటకం....ఆఁ.... ఇదంతా నమ్మాల్సిందేనా....ఏమో....మగాణ్ణి నమ్మమని ఎవరు చెప్పారు! ఎవరో ఆ పోకు లాడి....ఇవాళే యిదేదో తేల్చుకోవాలి. అతని వింతప్రవర్తనకు ఈ లేఖలోని అంశాలకీ అవి నాభావసంబంధముంది....నిశ్చయం. వారు విజయతో నిజంగానే....అబ్బబ్బా....!" సీత హృదయంలో అగ్నిపర్వతాలు 'ఢాం' మని పేలుతున్నాయ్. ఆలోచనలతో తల బ్రద్దలై పోతోంది.

రాత్రి 9-15 నిమిషాలు. కామేశంవస్తూనే "సీతా" అని పిలిచారు. జవాబులేదు. పడక గదిలోకి చరాచరా వెళ్ళిచూశాడు. యీజీ ఛేర్‌లో సీత పిచ్చిఆలోచనలతో అలసి సొలసి నిద్రపోతోంది. కండ్ల వెంబడి అశ్రుధారలు చారలుకట్టివున్నాయ్....కామేశానికేమీ పాలు పోలేదు.

"సీతా" భుజంతట్టి లేపాడు.

తృళ్లిపడి లేచింది సీత. చేతిలోని ఉత్తరం తొందరగా పయ్యెదలో దాచేసింది.

"ఏమిటది...."

"ఏమీలేదు...."

"అంటే...."

"ఏమీలేదంటే ఏమిటి ఏమీ లేదన్నమాట"

"చాలా వింతగావుందే నీ ధోరణి యివేళ"

"నేను పాతగానేవున్నాను .... మీరే క్రొత్త క్రొత్త వింతలు చవిచూస్తున్నారు."

"సీతా...."

"ఏం యింతవరకూ ఆఫీసుపనే....పాపం"

"పనుందో లేదో నీకేం తెలుస్తుంది...."

"అవును నాకెలా తెలుస్తుంది. ఓ లేడీ టైపిస్టుగానేనావుంటే తెలుస్తుంది...."

"అగు...."

"ఆగే ఉంటున్నానండీ .... అందుకే నా బ్రతుకిలా అయింది...."

"వి....జ....య ఎవరు?"

కామేశం తృళ్లిపడ్డాడు.

"నీకెందుకు....మా ఆఫీసులో టైపిస్ట్."

"అందుకే అడుగుతున్నా .... ఎంతమట్టు కొచ్చింది మీ ప్రణయకావ్యం"

"నోర్మూయ్....అర్థం లేనివాగుడూ నువ్వూన్నూ .... చదువుకున్నదానివి నీవే ఇలా అనుమానాలతో అల్లల్లాడిపోతే అసహ్యంగా ఉంటుంది."

"చెప్పానుగదండీ! నేనన్నా, నా మాటన్నా యిప్పుడు అసహ్యంగానే వుంటుంది"

"అట్టేవాగకు. అమాయకురాలు విజయను ఆడిపోసుకుంటున్నావ్ .... చిన్నపుడే భర్తను పోగొట్టుకొన్న నిర్భాగ్యురాలు...."

"ఓ! అదొహటా....నా బ్రతుకేకాక, ఆ జీవితంకూడా నాశనంచేస్తున్నావన్నమాట"

"మితిమీరిపోతున్నావ్ సీతా....పరిస్థితులు విషమింపచేయకు....ఏం చూశావ్ నీవు లేని పోని అనుమానాలతో అర్థంలేని ప్రేలాపన పేల్తున్నావ్...."

"ఆగండి .... యిది చూడండి" అంటూ సీత తనపయ్యెదలో దాచిన ఉత్తరం కామేశం మీద విసిరింది.

లేఖ చదువుతూ కామేశం ముచ్చెమటలు పట్టాడు. "ఇదా సంగతి ఈ వెధవ ఆకాశ రామన్న ఉత్తరాలకి ఇంత రాద్ధాంతంచేస్తున్నా వన్నమాట...."

"అగ్నిలేకనే పొగరాదు మేనేజర్‌గారూ"

"Shut up" సీత లెంప ఛెళ్ళుమనిపించి తను మేడమీదికి పోయాడు కామేశం.

అంతే ఆరాత్రి యిద్దరికీ శివరాత్రే!

కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది. సీతా కామేశంల జీవితం ముభావంగా సాగుతోంది. ఒహరితో ఒహరు మాటామంతీ లేదు. ఏమిటో వారి ఉద్దేశ్యం మరి!

* * *

భార్యాభర్తలమధ్య ముభావంగా సాగిపోతున్న రోజుల్లో ఓనాటి మధ్యాహ్నం కామేశం ఆఫీసుకిపోయాక, సీత బరువైన హృదయంతో సావిట్లో కుర్చీలో కూచొని ఏదో ఆలోచిస్తోంది.

వీధిలో టాక్సీ ఆగిన చప్పుడు, అంతలోనే స్లిప్పర్ల టకటక....

"ఎవరూ....జానకీ....ఏమిటే ఇలా హఠాత్తుగా వచ్చేశావ్"

"అవునక్కయ్యా మొన్నటితో పరీక్షలయి పోయాయ్....ఏమి తోచలేదు. ఇలా అనుకోకుండానే బయలుదేరివచ్చేశా"

"మంచిపనిచేశావ్ పద బట్టలు మార్చుకో. కాఫీ త్రాగి సావకాశంగా మాట్లాడుకుం...."

సాయంత్రం 4 గంటలు. సీతా, జానకి అప్పచెల్లెళ్ళిద్దరూ మేడమీద గదిలో చెరో కుర్చీలో కూర్చున్నారు.

"ఏమక్కా అలా వున్నావ్...."

"ఏంలేదే ఎలా వున్నాను...."

"చాలా నీర్సంగా కన్పిస్తున్నావ్"

"ఎప్పుడూ ఆరోగ్యం రోజులు ఒక్కలా ఉంటాయటే"

"ఏంటో వింతగా మాట్లాడుతున్నావ్.... బావ ఎన్నిగంటలకొస్తాడు"

"వారిదయ నాకేం తెలుస్తుంది. ఏ రాత్రో, వారికి బుద్ధిపుట్టినపుడు, ఇల్లూ పెళ్లాం వుందని తలపుకివచ్చినపుడు."

"కొంపతీసి కొట్లాడుకున్నారా ఏం? బావ అలా కొట్లాడవలసినవాడు కాడే...."

"అలా అనుకొని ఊరుకోవడమే నా కొంప మునుగుతోంది"

"ఏమయిందేమిటక్కా. ఉన్నదున్నట్టూ చెప్పవే".

"ఏం చెప్పను జానకీ! మా బ్రతుకెపుడు తిన్నపడుతుందో పెళ్లయినాక, యీ సంవత్సరన్నరయి హాయిగా జీవితం గడిపాం...."

"అయితే యిపుడొచ్చిన యిబ్బందేమిటి?"

"యిబ్బందేమిటి జానకీ....క్రొత్తగా వాళ్లాఫీసులో 'విజయ' అనే ఓ లేడీ టైపిస్టు ప్రవేశించింది. మీ బావకూ, ఆమెకు పరిచయమల్లా ప్రణయంగా మారింది. వారి సినిమాలేమో! వారి బీచిషికార్లేమో! ఏదో వేళకు రావడం, పోవడం లోకాన్నిమరచి తరువాత తనూ, తన ఆఫీసుపనీ....తన విజయ...."

"అగక్కయ్యా .... ఇదా సంగతి....బావగారు యింతరసికులా? అమాయకంగాకన్పిస్తు యింత లేనిగాటకాలాడ్తున్నారా...."

"ఏం చేయటం జానకీ! ఎన్నివిధాల ఆలోచించాను. ఏమీ పాలుపోకుండావుంది."

"సరే, చదువుకున్నదానివి నివే యిలా బేలగావుంటే ఎలా. నీ సంసారం సరిదిద్దుకో

వటం నీ చేతిలోమాట. అంతేకాని, నువ్విలా ఏడుస్తూ కూచుంటే తనకేం పోయింది...."

"ఏం చేయమంటావే మరి. గౌరవంగా బ్రతికే మన కుటుంబ గౌరవాన్ని వీధిలో పెట్టమంటావే."

"అంతపని ఏం చేయొద్దక్కా! బావ నాటకం అలా ఉంచు. మనమో అంతర్నాటక మాడాలి. దాంతో బావ తప్పక దారిలోకి వస్తాడు. నీవేమి భయపడకు. నే చెప్పినట్లు చేయడమే నీ వంతు."

కామేశంగారింట్లో సెంట్రల్‌హాల్లో బార్ లైటుబదులు, డిమ్ బ్లూలైట్ వెల్గుతోంది. వీధికి కర్టెన్. కామేశంగారు మెల్లగా గడపె క్కారు. హాల్లోంచి సంభాషణ పొంచి వింటు న్నాడు—

హాల్లో టేబిల్‌కి ఓ ప్రక్క సీత, ఆమె కెదురుగా వీధికి వెనుకజేసి ఓ సూటువ్యక్తి. తలని ఈవెనింగ్ హాట్-

"ఎన్నాళ్ళకు కలుసుకున్నాం సీతా...."

"నువ్వూ ఎవర్తైనో కట్టుకోలేక పోయావ్."

"స్త్రీ జాతంటే భయం, భయం సీతా...."

"గొప్ప మగాడివి కాఫీ తీసుకో చల్లారి పోతోంది."

"ఓ.... నీవూ తీసుకో...."

"నేత్రాగాలే...."

"అలా అనకు....నీవు కాస్త Sip చేస్తే, మిగతా ప్రసాదంనాది"

"ఫో జానకీరావ్ నీ పెంకితనం మానేవ్ కాదే...."



"ఏమిటి జానకీ అది....ఎటు పోయి ఎటు విషమిస్తుంది...."

"ఏం ఫర్వాలేదు....నేను వస్తానని బావకు తెలీదుగా?"

"నాకే తెలియనపుడు, ఆయనకెలా తెలు స్తుంది."

"సరే నే చెప్పినట్లు చేస్తావుగదూ...."

"అలాగేనే!....

"అంతా భగవదిచ్ఛ జానకీరావ్......ఆ కాలేజీ రోజులేవేరు."

"నాటకం రోజు జ్ఞాపకముందా! Love scene దంచి పారేశావ్. మనం పాడే డయలాగ్ వన్సుమోర్‌కూడా అందుకొంది."

"జ్ఞాపకం లేకేం....నాటికీ నేటికీ ఎంత తేడా...."

"అవును. నీవు పెళ్లి చేసుకున్నావ్. భర్తతో హాయిగా కులుకుతున్నావ్. నేనో బ్రహ్మచారినే యింకా ...."

"చాలా సేపయిందివచ్చి. వెళ్ళొస్తాను.... హొటల్లోనే నాబస. రేపు మీవారు ఆఫీసు కెళ్ళగానే అలావచ్చేయ్ మాటినీకి పోదాం.'

"ఓ యస్ అలాగే...."

అయితే యిపుడోసారి అంటూ సూట్‌వ్యక్తి సీతను గాఢాలింగం చేసుకుంటు ఉండగా ధన్‌మని బూట్ల చప్పుడు. "ఆగు కులటా" కామేశం హాల్లోకి ప్రవేశించంగానే, సూటు వ్యక్తి పెరట్లోకి పరుగుతీశాడు.

"ఎవరే ఆ సూటువాలా వాడితో ఆ సరసా లేమిటి. ఇంతసేపయి మీ నాటకం నేను

చూడలేదనుకుంటున్నావ్.... ఇదా నీ వాడుతున్న నాటకం...."

సీత కంపించిపోతూ "నేనేమీ ఎరుగనండీ...."

"Shut up నాకుకళ్లు లేవనుకున్నావా? ఎక్కడ దాచావ్ నీ రంకుమగణ్ణి....ఊఁ ఈవేళతో మీ యిద్దరికీ ఆయువు మూడింది."

బూట్లతో పెరట్లోకి ఒకటే పరుగు కామేశం పెరడల్లావెదకి బాత్ రూమ్‌లో టార్చివేశాడు. సూటువ్యక్తి హాల్లోకి ఒహటేపరుగు. కామేశం వెన్నాడుతూ "ఆగు సూటువాలా"

సూటువ్యక్తి తలవంచుకు నుంచున్నాడు.

"ఎన్నాళ్లనుంచి యీ నాటకం...."

"ఈవాళే రిహార్సల్స్ ప్రారంభం బావగారూ నమస్తే! సూటువ్యక్తి హేట్ తలనుంచి చేతికి తీసుకుంది.

"అఁ....నువ్వా....జానకీ....ఏమిటిదంతా" కామేశం తెల్లబోతూ కుర్చీలోకూలబడ్డాడు—

"బావుందా బావగారూ....మీది నాటకం మాది అంతర్నాటకం. ఇందులో హీరో హీరోయిన్లు నేనూ, అక్కా....విలనోమరి కామేశం తలవంచుకు మాట్లాళ్లేదు.

"అక్కా బావగార్కి వేడివేడి కాఫీతేవే.... పాపం పరుగులెత్తి అలసిపోయారు....బావా అక్కమీదంత కోపంవచ్చిందేం? నీ అడుగులకి మడుగులొత్తుతోందనా? ఎంత కోపం వచ్చింది అక్క నాటకంచూచి నీకు—కట్టుకొన్న భార్య పరాయిమగడితో మాట్లాడితే సహించలేవే? నీవేమో మీ విజయా దేవితో కులుకుతూ షికార్లూ, సినిమాలు వెలగ బెడితే అక్కనోరుమూసు కూరుకోవాలి ఏం? ఆమె హృదయం ఎంత క్షోభిస్తుందో ఆలోచించావా? ఎందుకూ విజ్ఞానవంతుడివి. మళ్లీ కబుర్ల పోగులా కథలు వ్రాస్తావ్ నిజాయితీ ఉట్టి పడిపోతూ. భార్యతో నిక్షేపంలా సంసారం సాగించక యీ చిన్న బుద్ధులేమిటి బావా? నీకు చెప్పేపాటిదాన్నా నేను? నిక్షేపంలాంటి సంసారం పాడుచేసుకుంటావా?....అక్కని 'కులట' అని ఎంత తేలిగ్గా అనేశావ్....ఛీ! పురుషజాతి నైజగుణం యిది. అసూయకి పుట్టిల్లు. స్వార్థానికి నిలయం...."

"ఆగు జానకీ ఆగు....రోజులు బాగాలేక తప్పుత్రోవ త్రొక్కిన మాట వాస్తవమే. నా సీతకి తీరని అన్యాయం చేశాను. ఆమె హృదయక్షోభ అర్థం చేసుకోలేక పోయాను.... కాని ఆ భగవంతుడు మనపాలిట వున్నాడు. నిన్ననే ఆ విజయను బీచ్‌లో చూశా మా ఆఫీస్ క్యాషియర్‌తో సరస సల్లాపాలు సాగిస్తోంది. ఈవేళ ఆఫీసులో నిలదీసి అడిగేసరికి, వాదోపవాదాలు పెరిగాయి. తత్ఫలితంగా ఆమె తన ఉద్యోగాన్కి రాజీనామాకూడా యిచ్చింది"

"అయ్యయ్యో పాపం....అక్కా విన్నావే బావగారి Ladf love I aom srry లేడీ టైపిస్ట్ రెజిగ్నేషన్ యిచ్చిందట..."

"అయ్యోపాపం!" అంటూ సీత కామేశంకి కాఫీగ్లాస్ అందిచ్చింది ముసి ముసి నవ్వులతో.

"Thanks సీతా" కామేశం కాఫీ సిప్ చేయడం మొదలెట్టాడు.

"చూశావా బావా నీ వంటే అక్కకెంత ప్రేమో! కాఫీ నీకిచ్చిందిగాని, తనకి చెల్లెల్నయినా నా కిచ్చిందిగాదు."

"నేనొచ్చేముందు యిద్దరూ సేవిస్తున్నారుగా...."

"నేనెక్కడ త్రాగానుబావా అక్కా ఆ సూటువాలా త్రాగారు."

"పోవే నీ వేళాకోళం నువ్వూన్నూ కావలస్తే మళ్లా యిస్తారా నీవూ అలసిపోయావుగా పరుగులెత్తి."

"చూశావ్ బావా అక్క నిన్నెలా సపోర్టు చేస్తోందో! ఎంతయినా భార్యా భర్తలుగదూ నేనే ప...రా....యి...."

"అబ్బే ఎంతమాట....పరాయి దానివెలా అవుతావు జానకీ. ఆ అక్కకి చెల్లివి యీ బావకి మ....ర....ద....లువి."

"ఓ అలాగా బావా ఆ Lady Typist వేకెన్సీలోనన్ను వెయ్యరాదూ."

"తప్పకుండా...."

"కొంపతీసి నన్ను 'విజయ' అనుకొని"

"ఏయ్ జానకీ మితిమీరి పోతున్నావ్.... మీబావ ఎంతో మంచివారు. లెండి భోజనాన్కి పదిగంటలవవస్తోంది" అంటూ సీత వంటింట్లోకి నడిచింది.

కామేశం, జానకి చిరునవ్వులతో సీత వెనకాలే అడుగులేశారు.

ప్రక్కింటి రేడియో, "గృహమేందా స్వర్గసీమా...." అంటూ గొంతెత్తి పాడుతున్నది.

నమస్తే!

## "మేకురా"

మా S.S.L.C. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జరుగుతున్నాయి. కాళిదాసు కవి రచనలను జ్ఞాపకముంచుకొనేందుకు "మేకురా" అనే పదాన్ని ఏర్పరచుకొన్నాము. "మేకురా" అంటే మేఘసందేశము, కుమారా సంభవము, రాఘువాభ్యుదయము. అనాళ్ మా తెలుగు పరీక్షలో కాళిదాసు రచించిన గ్రంథములు ఏవి? అనే ప్రశ్న పడ్డది. మాలో 'మేకురా' పదం జ్ఞాపకమున్న వాళ్ళందరూ చకచకా రాసేశారు. కాని పాపం! మా సుబ్బారావుకి మాత్రం ఆ కోడ్‌వర్డు ఎంత గింజుకున్నా జ్ఞాపకం రాలేదు గామోలు, మిగిలిన ప్రశ్నలు రాసి వెర్రి మొఖం పెట్టుకొని దిక్కులు చూస్తున్నాడు. నేను మా సుబ్బారావు పరిస్థితి గ్రహించాను. కాని మా సుబ్బారావుకెలా చెప్పడం? ఎగ్జామినరు ఇటూ అటూ చూస్తూ తిరుగుతున్నాడు. కాని మా సుబ్బారావు అదృష్టం బాగుండటం వలన ఒక మేకు వాడు కూర్చున్న కుర్చీలోంచి కొంచెం బయటకి వచ్చిఉన్నది, నాకంట బడింది. తటాలున నా బుఱ్రలో ఆలోచన ప్రవేశించింది. వెంటనే "మేకురా" అని అన్నాను. 'మేకురా' అన్నమాట వినగానే సుబ్బారావుగాడి మొఖం చేటంతయింది. ఆ ప్రశ్నకి కూడా టకటకా జవాబు రాసేసాడు. ఇంతలో ఎగ్జామినరు వచ్చి "ఏమిటయింది" అని అడిగాడు. "అబ్బే, ఏంలేదు సార్! మేకు గుచ్చుకుంటుందేమోనని చెప్పాను." అని మేకు వేపు చూపించాను.

"దిక్కులు చూడకుండా పేపరు రాసుకొండి" అని ఎగ్జామినరు బయటకి వెళ్ళిపోయాడు.

ఎగ్జామినేషన్ హాలు బయటికి వచ్చిన తరువాత మా సుబ్బారావు నే చెప్పినందుకు నన్నభినందించక కుర్చీలోని మేకుకు అభినందించాడు.

రామవరపు గణేశ్వర రావు.

★